
# విసురు

**శివ్రాజు**



"**అప్పుడు** ధర్మరాజు ఇట్లనియే..." మావాడు ఇంకా ఏదో చదవ బోతున్నాడు.

ఒక్క కసురు కసిరేను. వాడిని మనసులోనే చదువుకో మన్నాను. వాడు పైకి చదవడం ఆపు చేసి, "నాన్నా! ప్రపంచంలో అన్నిటి కంటే సులువైనది ఏమిటి?" అంటూ అడిగేడు.

"నీ చదువు చదువుకోరా...వెధవ యక్ష ప్రశ్నలూ, నువ్వూనూ!" మళ్ళీ కసిరేను.

"అదే, నాన్నా! మా మాస్టారు యక్ష ప్రశ్నలు బోర్డు మీద వ్రాశారు. జవాబులు వ్రాసుకు రమ్మన్నారు... పోనీ అన్నిటి కంటే కష్టమైన దేమిటి?"

"నన్ను విసిగించకు... స్కూలు కెళ్ళాక మీ టీచర్ని అడుగు... ఫో!" ఈ సారి చాలా గట్టిగా కేకలేశాను.

కేకలేశాకా చాలా బాధనిపించింది—పసి వాడిని అనవసరంగా దెబ్బలాడుతున్నానని.

"వెధవ గొడవ అని... ఇంటిలోన పోరు ఇంతింత కాదయా అన్నట్టు ఇంట్లో ఆడవాళ్ళు ఎందు కిలా కొట్టుకు చచ్చిపోతారో తెలియటం లేదు." చికాకుగా లేచాను.

మా అక్కకి పెళ్ళిలో పెట్టిన పట్టు చీర జరీ విడిపోయింది. పంజాబ్‌లో జరిగిన గొడవల గురించి మాట్లాడుకుంటూ ఉంటే అత్తా—కోడళ్ళ మధ్య ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది.

"మా వాళ్ళు పట్టు చీర పెట్టి పదిహేనేళ్ళయింది. ఇప్పటి కింకా కళ్ళు మాయలేదు." నొసలుతో వెక్కిరించింది మా ఆవిడ.

మాఅమ్మకు కోపం వచ్చింది. నా పెళ్ళిలో కేజీ అర్ధవై అయిదు రూపాయల రకం కొనక, అర్ధవై మూడు రూపాయల రకం జీడి పప్పు కొని ఉప్మాలోనూ, లడ్డూలోనూ వేసి కక్కుర్తి చూపించిన వైనం చెప్పి వాళ్ళ వాళ్ళందర్నీ బజార్లో పడేసింది మా అమ్మ.

మా అక్క పెళ్ళిలో మేనత్త కట్నాల దగ్గర వచ్చిన తగువు గుర్తు చేసి పడీ పడీ నవ్వింది మా ఆవిడ.



మా అమ్మ ఉడుక్కుంది. మా బావ మరిది - భార్య కానుకు చూసుకోకుండా బాధ్యతగా చెయ్యటం వలన మా పెళ్ళిలో లోపాలు లేవంది. మాఅక్క పెళ్ళి వేళకి నేను - మాఆవిడ కక్కుర్తి పడటం వలన అది అలా జరిగింది అంది. పెళ్ళాం మాటలు వినే సన్నాసి రకం మగాళ్ళు చేసే కార్యాలు అలా కాక ఇంకెలాగ ఉంటాయని కూడా ప్రశ్నించింది.

అటు తిరిగి ఇటు తిరిగి విసురు తన మీదకి తిరగడంతో మా ఆవిడ ఉడుక్కుని అంతెత్తుకు లేచింది. గత మూడు రోజులై ఇదే చిలికి చిలికి గాలి వాన అయింది.

ఎంత త్వరగా ఇల్లు వదిలి ఆఫీసుకు పోదామా అనిపించి అర గంట ముందుగానే గుమ్మం దిగేశాను.

నేను రోడ్లన్నీ సర్వే చేసి ఆఫీసుకి వెళ్ళేసరికి సెక్షనంతా అల్లకల్లోలంగా ఉంది. అక్కడ ఒక పానిపట్టు యుద్ధం జరగబోతోంది అనుకున్నాను. అర గంట వాదనలు విన్నాక చాటర్ బాక్స్ మా మీద కామెంట్ చేశాడని బోధపడింది. పగలంతా రాజకీయాలు, అక్కరలేని విషయాలు మాట్లాడుకుని, సాయంత్రం ఓవర్ టైములో ఆఫీసు పని చేస్తామని అన్నాడట. అది విన్న మరొక సెక్షన్‌లోని నారదు డొకడు—'నే చెప్పానని చెప్పకండేం" అంటూ మా సెక్షన్‌లో ఊదాడు ఈ వార్త.

ఒంటి గంటవుతూ ఉంటే లంచ్ అవర్ కావడంతో వాదనలు వాయిదా వేసి కాంటీన్‌కి వెళ్ళాం. కాంటీన్‌లో ముందు భాస్కరరావు నిలుచుని ఉన్నాడు. అతని పేరు సి. హెచ్. భాస్కరరావు. సమక్షంలో సి. బి. అని, పరోక్షంలో చాటర్ బాక్స్ అని పిలుస్తూ ఉంటారు. ఒకప్పుడు భాస్కరరావు మా సెక్షన్‌లోనే పని చేసేవాడు.

భాస్కరరావు కూర్చున్న సీట్లకి చుట్టుప్రక్కల సీట్లన్నీ మా సెక్షన్ వాళ్ళు ఆక్రమించారు. మా వరసచూసి భాస్కరరావు మొదట బిక్క చచ్చిపోయాడు. అయినా బింకం వదలలేదు.

"ఏరా! మామీద కామెంట్ చేశావట?" మావాడు ఒకడు అడిగాడు గుర్రుగా చూస్తూ.

"నేనేం కామెంట్ చేశాను?" అమాయకంగా అడిగాడు భాస్కరరావు.

"పగలంతా హస్కు కొట్టి, సాయంత్రాలు ఓవర్ టైము చేస్తామన్నావట గదా?"

రెప్పపాటు కాలం ఆగాడు భాస్కరరావు. తల వంచి, పూరీ ముక్కలో కూర సర్దుతూ తాపీగా అడిగాడు "అది నిజం కాదా?" అని.

అంతే! భాస్కరరావు అది నిజం కాదా? అని అడగ్గానే డైనమైట్ పేలినట్టయింది. మా వాళ్ళు ఇద్దరు ముగ్గురు కలిసి భాస్కరరావుని ఏక కాలంలో తిట్టసాగారు, కలగా పులగంగా. అతను అభిమన్యుడిలాగా అంతే స్థాయిలో జవాబులు చెప్తున్నాడు. చూస్తుండగానే పరిస్థితి విషమించి మా వాడొకడు భాస్కరరావుని కాలరు పట్టుకుని బయటకు లాగాడు. ఇంకొకడు తింటున్న కంచాన్ని అతని నెత్తిన ఒంపేశాడు.

చుట్టుప్రక్కల వాళ్ళు విడిపించక పోతే ఆ కొట్లాటలో కనీసం ఒకరిద్దరు చచ్చిపోయి ఉండేవారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస రొచ్చి వివరాలు కనుక్కుని వెళ్ళారు. భాస్కరరావుని, మా సెక్షన్‌లో ముగ్గుర్ని సస్పెండ్ చేశారు. ఎంక్వయిరీ తేదీ నిర్ణయించారు. మాలో ఆవేశాలు చచ్చి, భయాలు పట్టుకున్నాయి.

అసలే మాది స్ట్రాంగ్ యూనియన్. ఛాన్సు దొరికితే వీపు చీరేద్దామని చూస్తున్నారు అధికారులు. ఇంత చక్కటి ఛాన్సు దొరికితే వదుల్తారా? ఇద్దరు పనివాళ్ళు తమలో తాము తగువులాడుకోవడం వాళ్ళ పాలిట శాపం; వీళ్ళ పాలిటి వరం.

ఎంక్వయిరీ మొదలయ్యింది. భాస్కరరావు మా సెక్షన్ నించి వెళ్ళేడు కాబట్టి మా గురించి, మా పని గురించి అతనికి తెలియని విషయమంటూ ఏదీ లేదు.

అసలు భాస్కరరావు అలా కామెంట్ చేశాడా, లేదా —చేస్తే, అది రైటా? తప్పా? అన్నది వాదనకొచ్చింది. ఒకరి గురించి ఒకరు నాలిక దురద కొద్దీ విమర్శించుకోవడం ఎంత వరకూ సమంజసమన్నది చర్చనీయాంశమైంది.

భాస్కర రావ్ స్పష్టంగా మా సెక్షన్ వాళ్ళు ఎవరెవర్ని, ఎప్పుడెప్పుడు, ఏమేమని తిట్టారో, విమర్శించారో, దుయ్యబట్టారో, రంకులు కట్టారో... సోదాహరణంగా చెప్పాడు. అతను వివరించిన విషయాలన్నీ కరెక్టే మరి !

మేము మా సెక్షన్‌లోనే ఎవరైనా సెలవు పెడితే వాడి గురించి, వాడి కుటుంబం గురించి ఆ రోజంతా చర్చించుకుని ఆనందిస్తాం. మిగిలిన సెక్షన్ వాళ్ళ గురించి అతి అసహ్యంగా మాట్లాడుకుంటాం. ఎవడి భార్య ఎవడితో ఎలా తిరిగిందో, ఎవడు ప్రమోషన్ కోసం ఎన్ని అడ్డదార్లు తొక్కాడో చెప్పుకుని పడీ పడీ నవ్వుకుంటాం.

మా దృష్టిలో మేము తప్ప, మా కంపెనీలో పని చేస్తున్నవాళ్ళందరూ జీతాలు దండుగ వాళ్ళే! మేమొక్కరమే కష్టజీవులం...తీసుకొంటున్న జీతాలకి న్యాయం చేస్తున్న వాళ్ళం. మా కంపెనీలోనే పని చేస్తున్న మిగిలిన వాళ్ళు, మిగిలిన ప్రపంచం—అంటే గవర్నమెంట్ ఆఫీసులలోనూ, మిగిలిన ప్రైవేట్ సంస్థలలోనూ పని చేస్తున్నవాళ్ళందరూ—వట్టి తిండి దండగవాళ్ళని మా అభిప్రాయం.

రాజకీయాలు మాట్లాడుకొనేటప్పుడు కాని, సినిమాల వాళ్ళ గురించి మాట్లాడుకొనేటప్పుడు కాని 'ఆయన-ఆవిడ' అనే అంటాం. దేశ నాయకులని, అత్యంత ఉన్నత పదవిలోనూ, గౌరవించదగిన స్థానంలోనూ ఉన్నవారిని కూడా 'అది-వాడు' అంటూ చాలా విషయాలలో అసహ్యంగా, బుర్ర లేకుండా, పచ్చిగా, పాక్షిక జ్ఞానంతో అడ్డదిడ్డంగా విమర్శించే వాళ్ళకి— తను పూర్తి జ్ఞానంతో ఒక నిప్పులాంటి నిజాన్ని మాట్లాడితే దానికి వ్యతిరేకంగా రియాక్టయే నైతికబలం లేదన్నాడు భాస్కరరావు.

ఎందుకంటే...ప్రపంచంలో జరిగిన, జరుగుతున్న, జరగబోయే అన్ని విషయాలూ మాట్లాడేసరికే మాకు రోజులో ఉన్న ఆరున్నర పని గంటలూ చాలటం లేదు. అందుచేత ఆఫీసు పని తప్పనిసరిగా ఆఫీసు అవర్సు తర్వాతే చేయగలుగుతున్నాం.

ఇంకా మేము మంచివాళ్ళం కాబట్టి వారానికి ఏడు రోజులూ నా బందో అంటూ ఓవర్ టైమ్ చాకిరీ చేస్తున్నాం...అని మా అభిప్రాయం. అదే కొందరయితే వారానికి మూడు రోజులు ఓవర్ టైమ్ చేసేసరికే ఓపికలు లేవంటారు. పని చేసేవాడికి ఓపిక కావాలి కాని, ఓవర్ టైమ్‌లో కూడా సగం కాలం హస్కులో గడిపేసే వాళ్ళకి ఓపిక లెందుకుండవని కొందరు కిట్టనివాళ్ళు అనుకోవచ్చు గాక!

చాటర్ బాక్సు సోదాహరణంగా చెప్పిన విషయాలు, వివరాలు...వాదనకోసమైనా కాదనలేకపోయాము. చివరకు ఒకే పాయింట్ మీద నిలుచుండిపోయాము. మేము సరిగ్గా పని చెయ్యకపోతే సంజాయషీ అడగవలసింది కంపెనీ అధికారులు కాని, అడ్డమైన వాళ్ళకీ మామీద కామెంట్ చేసే అధికారం లేదన్నాం.

భాస్కరరావు కూడా ఒకే పాయింట్ మీద ఉండిపోయాడు. ప్రజాస్వామ్యం పేరిట, వాక్ స్వాతంత్ర్యం పేరిట మనం అడ్డమైన కారుకూతలు కూస్తున్నాం. మన బతుకు—వాళ్ళింట్లో కుక్కబెల్టు ఖరీదుపాటి చెయ్యకపోయినా, ఊళ్ళో వాళ్ళందరి గురించీ పచ్చిగా మాట్లాడుకొంటాం. మరి పాపం వాళ్ళవన్నీ భరించటం లేదా? తన విమర్శ నచ్చకపోతే పై అధికారులకు ఫిర్యాదు చెయ్యాలి కాని, అడ్డమైన వాళ్ళకీ తనమీద సాంబారు అన్నం ప్లేటు వంపే అధికారం లేదన్నాడు.

మొత్తంమీద ఇరు పక్షాలవారి మీ, మా పిలకలు కంపెనీ అధికారం చేతిలో పెట్టేశాం.

ఎంక్వయిరీ పూర్తి అయ్యింది. నిర్ణయం వాయిదా పడింది.

నాకు ఇప్పుడొక విషయం బోధపడింది. ఎవర్నైనా హింసించటం, బుర్ర లేకుండా నోటికి వచ్చినట్టు వదరడం చాలా ఆనందదాయకమైన విషయాలు! అదే, ఇతరులు ఎవరైనా మనం చేసే వెధవ పనిలో లక్షోవంతు చేసినా మనం సహించలేం!

ఇంటి కొచ్చేసరికి మాఅమ్మ, మాఆవిడ తారాస్థాయిలో కాట్లాడుకొంటున్నారు. నన్ను చూసి చూడగానే ఒకేసారి ఇద్దరూ నాకు కంప్లెయింట్ ఇవ్వడానికి నామీద పడబోయారు.

"నోర్ముయ్యండి..." వీలున్నంత గట్టిగా అరిచాను. వాళ్ళలో ఒకర్ని గౌరవిస్తూ నోరు ముయ్యమన్నానో, బహువచన ప్రయోగంగా ఇద్దర్ని నోరు ముయ్యమన్నానో అరం కాక కొత్త మనిషిని చూస్తున్నట్టు బిత్తరపోయి చూడసాగారు.

"మీరు ఇంకొక్కసారి ఇలా దెబ్బలాడుకొంటే మీ సంకటం కుదురుస్తాను. నేను ఉద్యోగం రిజైన్ చేసేసి మీ ఇద్దర్నీ పాతి కిళ్ళలో పాచిపన్లకి కుదురుస్తాను...ఏమనుకొంటున్నారో? రెండు పూటలా కడుపులు నిండి, ఖాళీ సమయాలు ఎక్కువయితే టైమ్ ఎలా గడపాలో తెలియక ఇలాగే కొట్టుకు చస్తారు. ఇవ్వాళ్నించీ పని మనిషినీ, చాకల్నీ మాన్పించేస్తున్నాను. ప్రయివేటు మాష్టర్ని, పాలు తెచ్చే మనిషినీ, పిల్లల్ని స్కూలుకి తీసుకెళ్ళే మనిషికి రానఖ్ఖరలేదని చెప్పండి. కారేజ్ మనిషిని మాన్పించేస్తున్నాను. అన్ని చాకిరీలు ఇద్దరూ సమంగా పంచుకొని చేసుకోండి. క్షణం తీరిక లేకపోతే ఒకరినొకరు విమర్శించుకొని దెబ్బలాడుకొనే టైమ్, ఓపిక రెండూ మిగలవ్! ఖబడ్దార్!" అని కేకలేసి అదే గొంతుకతో నా కొడుకుని కేకేశాను.

గదికి ఒక మూల బిక్కయిపోయి కూర్చుని ఈ గోలలో కూడా చదువుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు వాడు. నా కేకకి వణుకుతూ వచ్చి నిలుచున్నాడు.

"మొన్నీమధ్యని రెండు యక్ష ప్రశ్నలు అడిగావ్ కదరా! జవాబు రాసుకో...పుస్తకం తియ్! నెంబర్ వన్...ప్రపంచంలో అన్నింటికంటే సులువైనది ఇతరుల మీద మాట విసరడం. నెంబర్ టూ...ప్రపంచంలో అన్నింటికంటే కష్టమైనది ఒకరు విసిరిన అతి చిన్నదయిన మాట అయినా పడటం. వెళ్ళు...పో...రాసుకో..." అంటూ పంపేశాను. వాడు భయం భయంగా ఆనందంగా వెళ్ళిపోయాడు.

ఇప్పుడిక ఇంట్లో వాదనలు మచ్చుకైనా లేవు.

ఇప్పుడు ఆఫీసులో నేను రోజుకి ఆరు గంటలు ఇరవై అయిదు నిమిషాలు మాత్రమే బుర్ర వంచుకొని నిశ్శబ్దంగా పని చేసుకొంటున్నాను. ఎందుకంటే, ఆ మిగిలిన అయిదు నిమిషాలు ఎటెండెన్సు రిజిస్టర్లో సంతకం పెట్టిరావటానికి, పని ప్రారంభించేముందు దైవ ప్రార్థన చేసుకోవటానికి ఖర్చు అవుతున్నాయి మరి.

అన్నట్టు రోజంతా పని చెయ్యటం వల్లనో, ఏమో...ఓవర్ టైమ్‌లో చెయ్యడానికి పనే మిగలటం లేదు.

*

